ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
జిల్లా వార్తలు
5
సోమవారం 14 అక్టోబరు 2024



చేవెళ్లలో దుర్గామాత విగ్రహ శోభాయాత్ర



షాద్‌నగర్‌లో జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆమనగల్లులో రావణాసురుడి కటౌట్ దహనం

దసరా.. సరదా

- ఘనంగా విజయదశమి వేడుకలు
- బంధుమిత్రులతో ఉత్సాహంగా జరుపుకున్న ప్రజలు
- పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ

దసరా పండగను శనివారం జిల్లావాసులు ఘనంగా జరుపుకున్నారు. విజయానికి సంకేతంగా నిర్వహించుకునే ఈ పండగకు ఇతర ప్రాంతాల్లో ఉండేవారంతా సొంతూళ్లకు చేరుకున్నారు. బంధువులు, స్నేహితులు కలుసుకొని పండగ రోజు సరదాగా గడిపారు. తొమ్మిది రోజుల పాటు పూజలు చేసిన దుర్గమ్మ విగ్రహాలను పదో రోజు శోభాయాత్ర నిర్వహించి చెరువులు, పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. శనివారం సాయంత్రం ఆలయాల వద్ద జమ్మిచెట్టుకు పూజలు చేశారు. ఆ చెట్టు ఆకును పెద్దలకు అందించి ఆశీర్వాదం పొందారు. ఒకరికొకరు జమ్మి పత్రిని ఇచ్చిపుచ్చుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అంతకు ముందు పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. దసరా సందర్భంగా రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. - రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13 :

ఉమ్మడి జిల్లాలో మద్యం షాపుల వివరాలు

ప్రాంతం	2బీ-బార్స్	ఎలిట్ బార్స్	వైన్స్
మల్కాజిగిరి	115	02	88
మేడ్చల్	94	07	114
సరూర్‌నగర్	98	06	134
శంషాబాద్	152	05	100
వికారాబాద్	07	0	59


తెలంగాణలో ఏ పండుగ వచ్చినా చుక్క ముక్క ఉండాల్సిందే. మంచి.. చెడు ఏదైనా సరే మందు పడాల్సిందే. ఇక దసరా పండుగ వచ్చిందంటే సరేసరి. మనల్నెవడ్రా ఆపేదన్నట్లు ఉంటది మద్యం ప్రియుల తీరు. దసరా పండగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మద్యం ఏరులై పారింది. పండగకు సొంతూరు వచ్చిన బంధువులు, మిత్రులతో కలిసి జోరుగా దావత్‌లు చేసుకున్నారు. దీంతో మద్యం అమ్మకాలు.. తగ్గేదేలే అన్నట్లు జోరుగా సాగాయి.



కిక్కే కిక్కు!

దసరాకు ఫుల్లుగా తాగేశారు

- ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
- ప్రభుత్వ ఖజానాకు రూ.291.24 కోట్ల ఆదాయం



దసరా పండగకు జరిగిన అమ్మకాల వివరాలు

ఎక్సైజ్‌స్టేషన్ పేరు	2023 ఐఎంఎల్ కేసెస్	2023 బీర్ కేసెస్	2023 అమ్మకం విలువ(రూ.కోట్లలో)	2024 ఐఎంఎల్ కేసెస్	2024 బీర్ కేసెస్	2024 అమ్మకం విలువ(రూ.కోట్లలో)
మేడ్చల్	9,325	14,252	9.03	12,058	18,639	11.75
కుత్బుల్లాపూర్	25,439	41,460	26.57	29,469	46,550	29.36
బాలానగర్	21,040	36,702	22.56	24,942	42,487	26.42
మొత్తం	55,804	92,414	58.16	66,469	1,08,036	67.53
మల్కాజిగిరి	11,501	14,807	11.02	12,552	19,283	12.70
ఉప్పల్	14,872	26,223	15.89	16,117	27,548	16.65
ఘట్‌కేసర్	23,055	40,180	24.75	24,889	42,611	26.35
మొత్తం	49,428	81,210	51.66	53,558	89,442	55.70
సరూర్‌నగర్	17,410	32,395	19.02	20,287	41,663	22.95
హయత్‌నగర్	14,880	28,994	16.37	14,676	31,000	16.76
ఇబ్రహీంపట్నం	6,428	12,770	7.09	7,681	14,120	7.96
మహేశ్వరం	9,379	10,641	6.50	7,689	13,116	7.85
ఆమనగల్లు	9,746	11,967	9.32	8,211	15,751	8.66
షాద్‌నగర్	12,576	14,537	11.23	11,986	21,008	11.65
మొత్తం	67,419	1,11,304	69.53	70,530	1,36,658	75.83
శంషాబాద్	20,216	31,095	20.53	27,902	39,845	27.73
శేరిలింగంపల్లి	24,793	46,538	30.85	26,708	49,665	32.81
చేవెళ్ల	9,543	16,216	9.87	10,894	19,402	10.90
మొత్తం	54,552	93,849	61.25	65,504	1,08,912	71.44
వికారాబాద్	5,057	6,712	4.81	6,363	9,451	6.02
పరిగి	4,134	4,098	3.47	4,378	7,358	4.16
తాండూరు	5,062	6,693	4.36	6,752	9,909	5.92
మోమిన్‌పేట్	1,862	2,498	1.78	1,826	3,278	1.74
కొడంగల్	2,545	3,269	2.28	2,753	6,629	2.90
మొత్తం	18,660	23,270	16.71	22,072	36,625	20.74
మొత్తం	2,45,863	4,02,047	257.31	2,78,133	4,79,673	291.24

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 13 : దసరా పండగ వారం రోజులు ఉండనగానే ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు ఊపందుకున్నాయి. పండగకు పల్లెలకు వచ్చినవారు దోస్తులతో కలిసి విందులు వినోదాలలో మునిగిపోయారు. గత ఏడాది దసరా పండగ సందర్భంగా పది రోజుల్లో రూ.257.31 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఈ కిక్కు మరింత పెరిగింది. ఏకంగా రూ. 291.24 కోట్లు తాగేశారు. గతేడాదితో పోల్చితే రూ.33.93 కోట్లు అధికంగా అమ్మకాలు సాగాయి. దీంతో ఎక్సైజ్‌శాఖ ఖజానాకు భారీగా ఆదాయం వచ్చి చేరింది.

రంగారెడ్డి జిల్లాలో అధికం

ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాల్లో రంగారెడ్డి ముందంజలో ఉంది. ఈ జిల్లాలో గత ఏడాది రూ.130.78 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఈ సారి రూ.147.27 కోట్ల మద్యం అమ్ముడుపోయింది. గత ఏడాదితో పోల్చితే ఈసారి రూ. 16.49 కోట్ల మద్యం అమ్మకాలు అధికంగా జరిగాయి. సరూర్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఆమనగల్లు, షాద్‌నగర్ ఎక్సైజ్ పరిధిలో రూ.75.83 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. అలాగే శంషాబాద్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎక్సైజ్ డివిజన్ పరిధిలో రూ.71.44 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. జిల్లాలో అత్యధికంగా శేరిలింగంపల్లిలో ఎక్సైజ్ డివిజన్‌లో రూ. 32.81 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి.

మేడ్చల్ జిల్లాలో గత ఏడాది రూ. 109.82 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఈసారి రూ.123.23 కోట్ల మద్యం విక్రయించారు. ఈ సారి దసరా పండగ సందర్భంగా మేడ్చల్, కుత్బుల్లాపూర్, బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రూ.67.53 కోట్ల మద్యం అమ్మకాలు సాగగా.. మల్కాజిగిరి, ఉప్పల్, ఘట్‌కేసర్ స్టేషన్ పరిధిలో రూ.55.70 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ డివిజన్‌లో అత్యధికంగా రూ.29.36 కోట్ల మద్యం తాగేశారు.

వికారాబాద్ జిల్లాలో గత ఏడాది రూ.16.71 కోట్ల అమ్మకాలు జరగగా ఈ సారి 20.74 కోట్ల విలువైన మద్యం అమ్మేశారు. గత ఏడాది కంటే ఈ సారి రూ.4.03 కోట్లు సేల్ పెరిగింది. వికారాబాద్ డివిజన్‌లో రూ.6.02 కోట్లు, పరిగిలో రూ. 4.16 కోట్లు, తాండూరులో రూ.5.91 కోట్లు, మోమిన్‌పేట్‌లో రూ. 1.74 కోట్లు, కొడంగల్‌లో రూ.2.90 కోట్లు అమ్మకాలు జరిగాయి.

బీరు.. జోరు



దసరా పండగకు బీరు జోరు పెరిగింది. ఎండలు ప్రారంభం అవుతుండటంతో ప్రతీ ఒక్కరు చల్లని బీరువైపు మొగ్గు చూపారు. దాహాన్ని తీర్చుకునేందుకు లిక్కర్ కంటే బీర్లనే అధికంగా కొనుగోలు చేశారు. దసరాకు బీరు అమ్మకాలు అమాంతం పెరిగాయి. ఐఎంఎల్ కేసులు 2,78,133 అమ్ముడుపోగా, బీరు కాటన్లు మాత్రం 4,79,673 సేల్ అయ్యాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఈసారి బీరు విక్రయాలు జోరుగా సాగాయి.

పుష్కరిణిలో స్వామివారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



వైభవంగా చక్రస్నానం, తెప్పోత్సవం


చేవెళ్లలో ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

చేవెళ్ల, అక్టోబరు 13 : దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నిర్వహించిన చేవెళ్ల లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. సాయంత్రం స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో జమ్మిచెట్టుకు వేదమంత్రోచ్ఛరణల నడుమ పూజలు చేశారు. అనంతరం స్వామివారిని అశ్వవాహనంపై పట్టణ కేంద్రంలోని పుర వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నరేందర్, ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, అర్చకులు శ్రీకాంతచారి, శ్రీపాదు, వాసు, అనంతం, కన్నా, పూజారులు, వాసుదేవచార్యులు, కన్నా, శ్రీపాదు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో

ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ఆలయంలో అంజయ్య యాదవ్

కడ్తాల్, అక్టోబరు 13: ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విమర్శించారు. కడ్తాల మండలం మైసిగండి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పూజారులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరిచి మాట నిలుపుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలుకు నోచక, రైతుబంధు పెట్టుబడి సాయం అందక రైతులు వేదనకు లోనవుతున్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతులు సంతోషంగా ఉండేవారన్నారు. ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. షాద్‌నగర్ మున్సిపల్‌ఛైర్మన్ నర్సింహ్మా, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, రైతు అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి లతో కలిసి

కారులో చెలరేగిన మంటలు

- ప్రయాణికులతో బయటకు దిగిన డ్రైవర్
- తప్పిన ప్రమాదం
- పూర్తిగా దగ్ధమైన వాహనం
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు దారిలో ఘటన

శంషాబాద్, అక్టోబరు 13 : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వెళ్లే దారిలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగాయి. కారుడ్రైవరు అప్రమత్తం కావడంతో కారులో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్విఫ్ట్ కారులో ప్రయాణికులను ఎక్కించుకొని హైదరాబాద్‌కు డ్రైవర్ బయల్దేరాడు. కొద్దిదూరం వెళ్లాక షాట్‌సర్క్యూట్ కారణంగా కారులో నుంచి పొగలు వచ్చాయి. ఇది గమనించిన డ్రైవరు అప్రమత్తమయ్యాడు. కారులో ఉన్న ఇద్దరు ప్రయాణికుల తోపాటు తాను దిగిపోయాడు. కారులో నుంచి మంటలు అధికంగా రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఫైర్ ఇంజన్ అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేసింది. కాని అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ మేరకు ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కారులో చెలరేగిన మంటలు

లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతపరుస్తాం

ఆమనగల్లు, అక్టోబరు 13: లయన్స్‌క్లబ్ సేవలను కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను విస్తరిస్తామని క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సమావేశం ఆదివారం స్థానిక లయన్స్ భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ ఏడాది చేపట్టే సేవా కార్యక్రమాల ప్రణాళికను రూప కల్పన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ దామోదర్ రెడ్డి, కార్యదర్శి దోనాదుల మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ్మా, జిల్లా కో ఆర్డినేటర్లు రాంరెడ్డి, రాంచంద్రారెడ్డి, జిల్లా ఛైర్మన్లు జూలూరి రమేశ్, బావండ్ల వెంకటేశ్, విష్ణువాసురెడ్డి, సభ్యులు కరుణాకర్ రెడ్డి, అల్వాల్‌రెడ్డి, జంగారెడ్డి, కర్నాటి కొండల్ రెడ్డి, కండె సత్యం, మోహన్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పీఆర్‌వో పాష, తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ అంతర్జాతీయ పోటీలకు కత్తి ప్రసన్న



మేడ్చల్ టౌన్, అక్టోబరు 13 : త్రోబాల్ అంతర్జాతీయ పోటీలకు మేడ్చల్ పట్టణానికి చెందిన కత్తి ప్రసన్న కుమారి ఎంపికయ్యారు. కత్తి ప్రసన్న సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. అంతర్జాతీయ స్థాయి త్రోబాల్ క్రీడల ఎంపిక కోసం థాయిలాండ్, బ్యాంకాక్‌లో నిర్వహించిన పోటీల్లో భారత మహిళా జట్టు తరపున పాల్గొని ప్రతిభను కనపరచడంతో ఆమెను అంతర్జాతీయ త్రోబాల్ క్రీడల్లో పాల్గొనడానికి ఎంపిక చేశారు.



ఆలయంలో మేఘాలయ గవర్నర్ విజయ శంకర్, అర్చకులు

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న మేఘాలయ గవర్నర్

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 13: చిలుకూరు బాలాజీని మేఘాలయ గవర్నర్ విజయ శంకర్ దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన ఆయనకు ప్రధాన అర్చకులు సీఎస్. రంగరాజన్ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దివ్యమైన ఆశీర్వాదం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. శనివారం స్వామివారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని గవర్నర్ తెలిపినట్లు రంగరాజన్ పేర్కొన్నారు. ఆయనతో పాటు మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నర్సింహులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రోజా, పోలీసు, ఆలయ సిబ్బంది ఉన్నారు.



దసరా ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

విమర్శలు.. నవ్వులు

- దసరా ఉత్సవాల్లో ప్రధాన పార్టీ నేతల ముచ్చట్లు
- వికారాబాద్ జిల్లా తాండూరులో చర్చ

తాండూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరులో శనివారం దసరా ఉత్సవాల్లో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. విమర్శలు మరిచి ముగ్గురు నేతలు నవ్వులతో సరదాగా మాట్లాడుకున్న చిత్రాన్ని చూసిన ప్రజలు, నాయకులు, వివిధ పార్టీల శ్రేణులు చర్చించుకోవడం కనిపించింది. 10వ తేదీన తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి.. శాసనమండలిలో చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలపై రాజకీయ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అనుచరులు రోహిత్‌రెడ్డిపై ప్రతివిమర్శలు చేశారు. విమర్శలు, ప్రతివిమర్శలు ఇంకా కొనసాగుతున్న తరుణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో పాత తాండూరు బోనమ్మ దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు ముగ్గురు నేతలు (రోహిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలు) హాజరయ్యారు. అక్కడ ముగ్గురూ సరదాగా ముచ్చట్లు పెడుతూ నవ్వులతో కనిపించారు. ఈ చిత్రం సోషల్ మీడియాలో వైరల్ కాగా అది చూసిన తాండూరు నియోజకవర్గ ప్రజలు ఇప్పటికైనా కనువిప్పు చేసుకోవాలని, నేతలు ఒక్కటి ఎలా అవుతారో చూడండి అంటూ కామెంట్లు పెట్టడం గమనార్హం.

లొల్లి రాజేసిన 'రావణ దహనం'

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం

- కటౌట్‌కు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు
- ఇరువర్గాలను శాంతింపజేసిన పోలీసులు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 13 : రావణ దహనానికి ఏర్పాటు చేసిన కటౌట్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య చిచ్చు రేపింది. మేడ్చల్ పట్టణంలో దసరా వేడుకల్లో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ పెద్ద చెరువు అలుగు మత్తడి సమీపంలోని పార్కు స్థలంలో రావణ దహనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీంతో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎవరికి వారు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ నేతలు స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఆహ్వానిస్తూ, ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలయజేస్తూ ఫ్లెక్సీలు, కటౌట్‌లను ఏర్పాటు చేసి పరిసరాలను గులాబీమయం చేశారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఏర్పాటు చేశారంటూ స్థానిక పోలీసులు కొన్నింటిని తొలగించారు. ఈ విషయం పట్ల కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గమనించిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలీసులతో వాదిస్తున్న భాస్కర్ యాదవ్

ఇష్టం లేకనే దొంగచాటుగా..

కాగా, సాయంత్రం ఆరు గంటలకు కాంగ్రెస్ నేత నక్కా ప్రభాకర్ వేడుకలను ప్రారంభించారు. ఆ సమయంలోనే గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ ఏర్పాటు చేసిన రావణాసురుని కటౌట్‌కు నిప్పంటించారు. కటౌట్ సగం మాత్రమే కాలిపోయింది. ఆ సమయంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే రాక ముందే కాంగ్రెస్ నేతలు దొంగ చాటుగా రావణుడి కటౌట్‌ను తగలబెట్టారని మండిపడ్డారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా రావణ దహనం చేయించడం ఇష్టం లేక స్థానిక కాంగ్రెస్ నేతలు ఇలా చేశారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్, నాయకులు సందీప్ గౌడ్, మహేష్ యాదవ్‌లు కాంగ్రెస్ నేత నక్కా ప్రభాకర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. కాగా, ఎమ్మెల్యే రాకను తాము వ్యతిరేకించ లేదని, ఉత్సవ వేడుకల్లో పాల్గొనే హక్కు ప్రతీ ఒక్కరికి ఉందని బీఆర్ఎస్ నాయకులు తమ పార్టీపై సత్యదూరమైన ఆరోపణలు చేయరాదని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.



సగం కాలిన రావణుడి కటౌట్

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ప్రమాదాలు

ఆదిభట్ల, అక్టోబరు 13 : రెండు రోజుల వ్యవధి(శని, ఆదివారం)లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో నలుగురు వ్యక్తులు మృతి చెందగా, మరోవ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటనలు రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగాయి. సీఐ రాఘవేందర్ రెడ్డి, ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం మజ్‌గావ్ జిల్లాకు చెందిన డానీ సింగ్ (40) ఆదిభట్లలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. నిర్మల్ జిల్లా, ఖానాపూర్, శివాజీ నగర్‌కు చెందిన పెరుమళ్ల హరీష్ గౌడ్ (34) టీసీఎస్ లోపల నిర్మాణ పనులు చేసే శబరీ కన్‌స్ట్రక్షన్ సంస్థలో వాటర్ ప్రూఫింగ్ పనిచేస్తుంటాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా టౌన్‌కు చెందిన ప్రకాష్ (30) అదే సంస్థలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురు టీసీఎస్ ఎదురుగా నిర్మాణ సంస్థకు చెందిన తాత్కాలిక నివాసం (రేకుల షెడ్)లో ఉంటున్నారు. కాగా శని, ఆదివారం రెండు రోజులు సెలవులు కావడంతో ఆ ముగ్గురు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బైక్ పై ఆదిభట్ల నుంచి బొంగ్లూరు వైపు వస్తున్నారు. శ్రీరామ ధర్మకాంట సమీపంలోకి రాగానే బైకు అదుపు తప్పి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న ప్రకాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెనుకాల కూర్చున్న డానీసింగ్, హరీష్ అక్కడికక్కడే మృతి చెందారు.

మరో ప్రమాదంలో ఒకరు..

బొంగ్లూరు కృతుంగ హోటల్ సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం రాగన్నగూడ పరిధిలోని సప్తగిరి వెంచర్‌లో నివాసముంటున్న నర్ర శివారెడ్డి(35) ప్లంబర్ పని చేస్తుంటాడు.



శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగ్లూరు పరిధిలోని మెట్రోసిటీలో వ్యక్తిగత పని ఉండటంతో బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా బొంగ్లూరు కృతింగ హోటల్ సమీపంలో బైకు అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో శివారెడ్డి తలకు బలమైన గాయాలై అక్కడికి అక్కడే మృతి చెందాడు.

డీసీఎం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి...

డీసీఎం వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుర్కయంజాల్ తులీప్ గ్రాండ్ హోటల్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కాగా మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదు. మృతుడు కూలీ పనులు చేసుకుంటాడని పోలీసులు భావిస్తున్నారు. చనిపోయిన వ్యక్తి వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉండొచ్చని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే ఆదిభట్ల పోలీస్ స్టేషన్ 8712662671, సీఐ రాఘవేందర్ రెడ్డి 8712662364, ఎస్సై రాజు 8712662382 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రంగాపూర్ సమీపంలో రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

మంచాల: మండల పరిధి రంగాపూర్ సమీపంలో ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి-భువనగిరి జిల్లా నారాయణపురం మండలం కొర్రవాని తండాకు చెందిన కొర్ర రవీందర్(38) బైక్‌పై అంబోత్‌తండాలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా రంగాపూర్ సమీపంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న మరో వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ రవీందర్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. రవీందర్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నా రు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నవరాత్రి ఉత్సవాల్లో విషాదం

బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్‌లో ఘటన



మృతదేహాన్ని పైకి తీసుకువస్తున్న యువకుడు

బషీరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) నవరాత్రి ఉత్సవాల్లో విషాదం చోటుచేసుకుంది. దుర్గామాతను చెరువులో నిమజ్జనం చేసేందుకు గ్రామస్తులతో కలిసి వెళ్లిన ఓవ్యక్తి చెరువులోకి దిగి నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ గ్రామశివారులోని చెరువులో ఆదివారం చోటుచేసుకుంది. రెడ్డిఘణాపూర్‌కు చెందిన వెన్నచెడ్ అశోక్(38) వ్యవసాయ కూలీ. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం దుర్గామాత నిమజ్జనోత్సవంలో గ్రామస్తులతో కలిసి పాల్గొన్నాడు. గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేస్తుండగా 1శోక్ వేరొకవైపు నుంచి చెరువులోకి దిగాడు. కేరింతలు కొడుతూనే లోతు నీళ్లలోకి వెళ్లగా అందరూ చూస్తుండగానే నీట మునిగి గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామస్తులు తర్వాత యువకులతో గాలింపు చర్యలకు ఉపక్రమించారు. సాయంత్రం 5గంటల సమయంలో మల్కన్‌గిరికి చెందిన యువకుడు రవీందర్ నీట మునిగి గాలించగా మృతదేహం లభ్యమైంది. అప్పటికే ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్ఐ ఎంఏ గఫార్ ఘటనాస్థలం వద్ద విచారణ జరిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



తాండూరులో పట్టణం దేవినగర్‌లో..

వృథాగా భగీరథ నీరు

తాండూరు, అక్టోబరు 13: మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం నిండా కనిపిస్తుంది. పైప్‌లైన్ల లీకేజీ అయి నెలలు గడుస్తున్నా.. ఫిర్యాదులు చేసిన పట్టించుకోక పోవడంతో నీరు వృథాగా పోతుంది. తాండూరు పట్టణం దేవినగర్‌లో ఆదివారం మిషన్ భగీరథ పైప్ పగిలి నీరు ఎగిసిపడ్డాయి. గంటల తరబడి నీరు వృథాగా పోతున్న విషయాన్ని మిషన్ భగీరథ సిబ్బంది దృష్టి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. స్థానిక నాయకుల ద్వారా మిడియా ప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్పుడు సిబ్బంది స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేశారు. పట్టణంలో చాలా ప్రాంతాలలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు ఉన్నాయని అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఉమ్రా యాత్రకు బయలుదేరిన ముస్లింలు

'ఉమ్రా'కు యాత్రికులు

శంషాబాద్, అక్టోబర్ 13: శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదివారం రాత్రి తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన యాత్రికులు ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ రహమతుల్లా తయ్యబ్ ఈ యాత్రను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తానని యాత్ర కన్వీనర్ మహ్మద్ ఫైయ్యాజ్ తెలిపారు.

అభివృద్ధిని పట్టించుకోని గత పాలకులు

- అక్రమ డబ్బుకు ఆశపడటం చరిత్రలో లేదు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 13: గత పాలకులు పదవులు అడ్డుపెట్టుకొని హైదరాబాద్‌లో ఉంటూ ఎంజాయ్ చేసి అభివృద్ధి గురించి ఆలోచించిన పాపన పోలేదని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను గత పాలకుల మాదిరిగా కాకుండా వారానికి మూడు, నాలుగు రోజులు తాండూరులోనే ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నానని గుర్తు చేశారు. తనకు వ్యాపారాలు ఉన్నందున ఆర్థికంగా బాగానే ఉన్నానని, అక్రమంగా డబ్బు తీసుకోవడం తన రాజకీయ చరిత్రలోనే లేదన్నారు. పదవులు ఇస్తానని తానెప్పుడు ఎవరికీ మాట ఇవ్వలేదని గ్రౌండ్‌లో పని చేసే వారికి పదవులు ఇచ్చినట్లు తెలిపారు. అక్రమ ఇసుక, మైనింగ్ అనేది పెద్ద బోగసని ఆయన కొట్టి పారేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న గత పాలకులకు రోడ్లు ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఆరు నెలల్లో నర్సింగ్ కళాశాల పనులు పూర్తి చేస్తామని, దౌలాపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తామని, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పనులు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. 25 వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూర్చే ఈఎస్ఐ ఆస్పత్రిని త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. గత పాలకులు పట్టించుకోని కోట్‌పల్లి, జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి, స్పీకర్ సహకారంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

'నేవిరాడార్' విషయంలో పునరాలోచించాలి

- వికారాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి
- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

వికారాబాద్, అక్టోబర్ 13 : దామగుండం నేవీ రాడార్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం మరోమారు ఆలోచించాలని, దీని వల్ల మనుషులు, పక్షులకు ప్రాణ నష్టం జరుగుతుందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన కేవలం కొడంగల్‌కు మాత్రమే అన్నట్లుగా ఉందని ఆరోపించారు. జిల్లా కేంద్రానికి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కేటాయించ లేదన్నారు. ఇప్పటికైనా వికారాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. అభివృద్ధి విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శ్రద్ధచూపాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. అప్పా నుంచి మన్నెగూడ వరకు మంజూరైన జాతీయ రహదారిని వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా ఎమ్మెల్యేలు అభివృద్ధి విషయంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. వికారాబాద్‌పై చిన్న చూపు చూస్తే మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, నాయకులు అప్పా విజయ్ కుమార్, చైతన్య కిరణ్ , కేదార్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత కంపెనీలతో

ఉపాధి కల్పించాలి

కొడంగల్, అక్టోబరు 14: కొడంగల్ ప్రాంతంలో కాలుష్య రహిత కంపెనీలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని కొడంగల్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని ఫార్మాసిటీ లాంటి కంపెనీలు ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

అంధకారంలో గ్రామాలు

ధారూరు, అక్టోబరు 13: వర్షంతో ధారూరు సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు. శనివారం కురిసిన వర్షానికి 33కేవీ ప్రధాన లైన్‌లో సమస్య రావడంతో ధారూరు సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం ఉదయం వరకు సరఫరా కాలేదు. అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా వికారాబాద్, సదాశివపేట నుంచి విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సంక్షేమ పథకాల అమలులో

ఇందిరమ్మ కమిటీలే కీలకం

తాండూరు, అక్టోబరు 13: సంక్షేమ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీ సభ్యులే కీలకమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన నియోజకవర్గస్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మహిళా సంఘాలకు, యువకులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రూపులు, వర్గాలు అంటూ అక్కడ ఆస్కారం ఇవ్వద్దని, అందరూ కలిసి సమష్టి నిర్ణయంతో కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన శ్రేణులకు సూచించారు. అధికారులతో పాటు పార్టీ శ్రేణులు కమిటీతో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ధారాసింగ్, నారాయణరెడ్డి, రవీందర్‌గౌడ్, శరణు బసప్ప, అంజయ్య, ప్రవీణ్‌గౌడ్, గాజీపూర్ నారాయణరెడ్డి, హబీబ్‌లాల, వేణుగోపాల్, పటోళ్ల బాల్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, అజయ్ ప్రసాద్, సురేందర్‌రెడ్డి, రాములు, అక్బర్‌బాబా, పేరి రాజేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు.

డ్రైవర్ చికిత్సకు యూనియన్ రూ.50వేల సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న డ్రైవర్స్ యూనియన్ సభ్యులు

తలకొండపల్లి, అక్టోబరు 13: డ్రైవర్స్ యూనియన్ సభ్యులు ఉదారం చాటుకున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తమ తోటి డ్రైవర్‌కు చేయూతనందించారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామానికి చెందిన డ్రైవర్స్ యూనియన్ సభ్యుడు ఎండి. షకీల్‌కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డ్రైవర్స్ యూనియన్ సభ్యులు షకీల్‌ను పరామర్శించారు. వైద్య చికిత్సల నిమిత్తం తలకొంత పోగు చేసి రూ. 50 వేలు ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


యాచారం: మొండిగౌరెల్లిలో జమ్మి చెట్టు వద్దకు వెళ్తున్న గ్రామస్థులు


తలకొండపల్లి: చంద్రధనలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


చేవెళ్లలో అమ్మవారి శోభాయాత్రలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


షాబాద్: సర్దార్‌నగర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి

ఉత్సాహంగా, ఉల్లాసంగా దసరా వేడుకలు


చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా జరుపుకునే విజయదశమి పర్వదినాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహించి చెరువు కుంటల్లో నిమజ్జనం చేశారు. అంతకు ముందు గ్రామ సమీప పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లి పాలపిట్టను చూశారు. గ్రామ కూడళ్లు, ఆలయాల వద్ద జమ్మిచెట్టుకు పూజలు చేసి ఒకరికొకరు బంగారాన్ని పంచుకొని ఆలింగనాలతో శుభాకాంక్షలు చెప్పు కున్నారు. దసరా వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 13


షాద్‌నగర్ అర్బన్: మధురాపురంలో దుర్గామాత విగ్రహ శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్థులు


కందుకూరు:కొత్తగూడలో జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, సంజీవరెడ్డి


షాద్‌నగర్: పండుగు సందర్భంగా సీఎంతో వ్యక్తిగత కార్యదర్శి లింగారెడ్డిగూడ అశోక్


మొయినాబాద్ రూరల్: అమ్డాపూర్‌లో జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ గోపీకృష్ణారెడ్డి, గ్రామస్థులు


శంషాబాద్: జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి


చేవెళ్ల:మల్లాపూర్‌లో అమ్మవారి మెడలోని డబ్బుల దండను వేలంలో దక్కించుకున్న ఇంద్రసేనారెడ్డి


షాబాద్: పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి


చౌదరిగూడ: తుమ్మలపల్లిలో జమ్మి చెట్టుకు పూజలు


కేశంపేట:అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు


శంషాబాద్: గూడూరు చెరువులో దుర్గామాత నిమజ్జనం


కడ్తాల్ : మైసిగండిలో అమ్మవారి పూజల్లో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


తలకొండపల్లిలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ పూజలు


కోనాపూర్‌లో టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి అండెకార్ యాదిలాల్, పాపిశెట్టి రాము పూజలు


ఆమనగల్లులో ఊరేగింపులో ఆర్యవైశ్య సంఘం మహిళలు


కడ్తాలలో పల్లకి సేవ

ముగిసిన వాలీబాల్ టోర్నీ

తలకొండపల్లి, అక్టోబరు 13: చుక్కాపూర్‌లో మూడు రోజులు నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు నాయకులు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, జక్కు శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. యువత క్రీడల్లో రాణించి గుర్తింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, యాదయ్య, తాహెర్, రాజలింగం, వెంకటయ్య, నర్సింహ పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న పాండురంగారెడ్డి


గెలుపు ఓటములను సమానంగా భావించాలి

చౌదరిగూడ, అక్టోబరు 13: క్రీడాకారులు ఆటల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకుంటూ స్ఫూర్తిమంతంగా మెలగాలని కొందుర్గు మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. ఆదివారం కొందుర్గులో వీపీఎల్ ప్రీమియర్ లీగ్-4 సీజన్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల నైపుణ్యం ఇలాంటి పోటీలతో వెలుగులోకొస్తుందన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతాయన్నారు. అలాగే జైబీమ్ ప్రీమియర్ లీగ్-4 పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మండలాధ్యక్షులు శ్రీశైలం, కృష్ణారెడ్డి, నాయకులు బోయ శంకర్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, కేకే, రాములుగౌడ్, నరేందర్, రఘునాథ్‌గౌడ్, శేఖర్, వీరేందర్, యాద య్య, అర్జున్, ప్రశాంత్, శ్రీహరి, ఆంజనేయులు, శీను పాల్గొన్నారు.


కొందుర్గు: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

పోలీసులకు ప్రజలు సహకరించాలి

ఆమనగల్లు, అక్టోబరు 13: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ ప్రమోద్‌కుమార్ కోరారు. నేర పరిశోధన, నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయన్నారు. మేడిగడ్డ తండావాసి నవీన్ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. స్థానికుల సహకారంతో తండాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాడు. ఆదివారం నవీన్‌ను సీఐ, ఎస్ఐ వెంకటేశ్ సత్కరించారు. ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సిబ్బంది రఘు, మల్లేశ్, శివ, పాల్గొన్నారు.


నవీన్‌ను సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐ

సీఎంను కలిసిన ఆసిఫ్ అలీ


సీఎం రేవంత్‌రెడ్డితో ఆసిఫ్ అలీ

కడ్తాల్, అక్టోబరు 13: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కడ్తాలకు చెందిన రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం తన స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి వచ్చిన సందర్భంగా ఆయన్ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకుపోవాలని రేవంత్‌రెడ్డి సూచించినట్లు అలీ చెప్పారు.

పేదింటి పెళ్లికి పుస్తెమట్టెల వితరణ


వధువుకు పుస్తెమట్టెలు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ

కొత్తూర్, అక్టోబరు 13: మండల పరిధిలోని శేరిగూడభద్రాయపల్లికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడి వివాహానికి కొత్తూర్ మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ దంపతులు పుస్తెమట్టెలు అందజేసి ఉదారతను చాటుకున్నాడు. గ్రామానికి చెందిన వర్తపు కాశయ్య కొన్నేళ్ల కింద మరణించాడు. అతడి భార్య వెంకటమ్మ కాయకష్టం చేసి కుమారుడు, కూతుర్ని పెద్ద చేసింది. కాగా వెంకటమ్మ కొడుకు రాజేష్ వివాహానికి వధువుకు మాజీ జడ్పీటీసీ పుస్తెల తాడు, మట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా పెళ్లింటి వారు శ్రీలతసత్యనారాయణ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుక


వెల్జాల్‌లో బతుకమ్మ సంబరాల్లో మహిళలు, గ్రామస్తులు

తలకొండపల్లి, అక్టోబరు 13 : ఖానాపూర్, వెల్జాల గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకను ఆదివారం నిర్వహించారు. ఏటా దసరా మరుసటి రోజు ఈ గ్రామాల్లో బతుకమ్మ పండుగ నిర్వహిస్తారు. మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో బతుకమ్మలు పేర్చి గ్రామ కూడళ్లలో పెట్టి ఆడిపాడారు. అనంతరం చెరువు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఆయా చోట్ల కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ సంగీత, జడ్పీ కో-ఆప్షన్ మాజీ మెంబర్ ముజ్బుర్ రహెమాన్, నాయకులు అంబాజీ, బొజ్జ వెంకట్రామ్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరం

మాడ్గుల, అక్టోబరు 13:ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే పేదలకు సీఎం సహాయ నిధి పథకం వరం వంటిదని కాంగ్రెస్ నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి అన్నారు. మాడ్గులకు చెందిన 9మంది అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా రు. వారికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైంది. ఆదివారం లబ్ధిదారులకు ఎల్వోసీలను కొండల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎం.రాములు, జంగయ్య, యాదయ్య పాల్గొన్నారు.


ఎల్వోసీలను అందజేస్తున్న కొండల్‌రెడ్డి

సంక్షిప్తంగా...

- తలకొండపల్లి: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ జంగారెడ్డిపల్లిలో పసుల శివ అనే యువకుడు మృతిచెందాడు. ఆదివారం అతడి మృతదేహాన్ని మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్‌లు సందర్శించి నివాళులర్పించారు. శివ కుటుంబాన్ని పరామర్శించి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెంకటేశ్ రూ.1.16లక్షల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి పాండు, తదితరులు ఉన్నారు.
- యాచారం: కుర్మిద్దలో దుర్గామాత మండపంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి పూజలు చేశారు. మండప నిర్వాహకులు వారిని సత్కరించారు. శాంతియుతంగా పండగ జరపుకోవడం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలన్నారు.

వాలీబాల్ పోటీల్లో విజేత షాద్‌నగర్ జట్టు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కేశంపేట, అక్టోబరు 13: దసరా సందర్భంగా యువజన సంఘాలు నిర్వహించిన వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు నిర్వాహకులు, దాతలు బహుమతులను అందజేశారు. శతాబ్ది టౌన్షిప్ యజమాని కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.50వేలు అందజేశారు. పురుషుల విభాగంలో షాద్‌నగర్ టీం గెలిచింది. దాత రమణగౌడ్ రూ.20వేలు, రన్నర్స్ కేశంపేట టీంకు కోడుపర్తి శ్రీకాంత్‌రెడ్డి రూ.10వేలు అందజేశారు. మహిళల విభాగంలో నల్గొండ టీం గెలిచింది. తలసాని పవన్‌కుమార్‌రెడ్డి రూ.15వేలు, రన్నర్స్ తలకొండపల్లి టీంకు ఎండీ లయాఖ్ రూ.7500, థర్డ్‌ప్లేస్‌లోని గుడుమాల్ టీంకు కేశంపేట రెడ్డి సేవా సమితి రూ.5వేలు, నాల్గో స్థానంలోని ఆత్మకూర్ నజీర్ టీంకు రూ.3వేలు అందజేశారు. క్రీడాకారులకు జెర్సీలను మాజీ జడ్పీటీసీ టి.విశాలశ్రవణ్‌రెడ్డి దంపతులు అందజేశారు. నాయకులు శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 13 : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం తొర్రూరులోని క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, ఆయన అభిమానులు ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లోని కాంగ్రెస్ కార్యకర్తలు డప్పు చప్పుడుతో తొర్రూరుకు తరలివచ్చి ఆయన్ను కలిశారు. కార్యక్రమంలో రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులున్నారు.


ఎమ్మెల్యే రంగారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గడ్డి అన్నారం ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి

అట్టహాసంగా పుస్తకావిష్కరణ

ఆమనగల్లు, అక్టోబరు 13: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లిలో ఆదివారం ముస్లింలు 'ఎవరు మెజారిటీ? భారత ముస్లింలు మూల వాసులే' అనే పుస్తకాన్ని అట్టహాసంగా ఆవిష్కరించారు. ప్రముఖ సామాజిక కవి, విశ్లేషకుడు స్కైబాబ ఈ పుస్తకాన్ని రచించారు. తెలంగాణ బ్లాక్ వాయిస్ ఆర్థిక సహకారంతో రచించిన పుస్తకాన్ని గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. పుస్తకాన్ని రచించిన స్కైబాబను ఈ సందర్భంగా బ్లాక్ వాయిస్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో బ్లాక్ వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందు శ్రీధర్, శీలం ముత్యాలు, పల్లేటి వరుణ్, మహ్మద్ బాగ్దాద్‌పాషా, గుండాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీధర్, ముత్యాలు

అమ్మవారి అలంకరణ వస్తువుల వేలం

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు, అక్టోబరు 13 : ఫరూఖ్‌నగర్ మండలం మధురాపురంలో ఎం.గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆదివారం శోభాయాత్రకు ముందు అమ్మవారికి అలంకరించిన తొమ్మిది రోజుల చీరలను వేలం వేశారు. భక్తులు 3,63,727రూపాయలకు చీరలు కైవసం చేసుకున్నారు. మొదటి రోజు చీరను రూ.5,116కు దేవకమ్మ నారాయణరెడ్డి, రెండో రోజు నుంచి తొమ్మిదో రోజు చీరలను వరుసగా 4,516కు లక్ష్మీచంద్రారెడ్డి, 6,516కు శ్యామలమ్మప్రభాకర్‌రెడ్డి, రూ.10,116కు రాజమౌళి శ్రావణిరాజుగౌడ్, 10,116కు వసంతబుచ్చిరెడ్డి, 62,116కు భారతమ్మపద్మారెడ్డి, 1,00,116కు మాధవివినాయక్‌గౌడ్, 61,116కు జ్యోతివెంకటేష్, తొమ్మిదో రోజు చీరను ఎక్కువ ధరకు రూ.1,03,999కి ముట్పూర్ జ్యోత్స్నాచంద్రారెడ్డి కౌవసం చేసుకున్నారు. అలాగే ఆమనగల్లు మండలం కోనాపూర్‌లో దుర్గామాత సేవాసమితి అమ్మవారి ముక్కు పుడకను వ్యాపారవేత్త అలివేలుకిష్టయ్య దంపతులు రూ.1.56లక్షలకు, చీరలు మహేశ్, అంజయ్య, రాములు, యాదయ్య, సర్వేశ్, ఎట్టయ్య, రాజు, వెంకటయ్య రాజేశ్, రమేశ్, కలశం కుమార్, నోట్ల దండను పురుగుల సోదరులు దక్కించుకున్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 13: ప్రతీ మనిషి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఆనందం పొందుతాడని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయానికి ఓ భక్తుడు ఉత్సవాల కోసం రెండు ఇత్తడి పీటలను ఇచ్చారు. విజయదశమి నాడు ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే నర్సింహులు, వీహెచ్‌పీ క్షేత్ర ప్రముఖ్ రమేష్‌ల సమక్షంలో ఆలయానికి అప్పగించారు. షాద్‌నగర్ ప్రాంతంలో శ్రీమంతులు ఎందరో ఉన్నా.. ఆలయానికి సౌకర్యాలు కల్పించే అదృష్టం కొందరికే వస్తుందని అన్నారు. ఇత్తడి పీటలను ఇచ్చిన అజ్ఞాత దాత ఆలయ అభివృద్ధిలో పాల పంచుకుంటున్నారని బక్కని నర్సింహులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

- పెళ్లయిన నెలన్నరకే ఉరేసుకొని బలవన్మరణం


నరేష్(ఫైల్)

యాచారం, అక్టోబరు 13: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మొండిగౌరెల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొండిగౌరెల్లికి చెందిన నరేష్(25)తో మేడిపల్లికి చెందిన నిహారికతో 45రోజల క్రితం వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచీ దంపతులు కలహరించుకుంటున్నారు. దీంతో మనస్తాపం చెంది నరేష్ ఉరేసుకున్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ ...

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 13: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి ఖానాపూర్‌లో శనివారం రాత్రి ఓ మహిళ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం లక్ష్మీదేవిగూడానికి చెందిన కప్పరి సాలమ్మ(30)కు భర్త నర్సింహ, కుమారుడు, కూతురు ఉన్నారు. వీరు స్క్రాప్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాలమ్మ కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతోంది. రెండు రోజులక్రితం కుటుంబం ఖానాపూర్‌లోని బంధువుల వద్దకు వచ్చారు. శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయిన సాలమ్మ ఆదివారం ఉదయం చెట్టుకు ఉరేసుకొని కనిపిచింది. పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కనకమామిడి అయ్యప్ప ఆలయంలో చోరీ

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 13 : కనకమామిడిలోని అయ్యప్ప ఆలయంలో దొంగలుపడి రూ.లక్ష విలువచేసే వస్తువులను ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కనకమామిడి చౌరస్తా సమీపంలో అయ్యప్పస్వామి గుట్టపై ఉన్న ఆలయంలో శుక్రవారం రాత్రి దొంగలుపడ్డారు. ఆలయ వంటగది తాళం పగులగొట్టి లోనికి వెళ్లి రూ.లక్ష విలువ చేసే సామగ్రి, వస్తువులను ఎత్తుకెళ్లారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న వారిని వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, ఆలయాల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో తోటమాలి మృతి

శంషాబాద్, అక్టోబరు 13: మండల పరిధి హమీదుల్లానగర్‌లోని ఓ గార్డన్ తోటమాలి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రికి వెలుగులోకొచ్చింది. శంషాబాద్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్లగూడలో ఉండే ఇరిగిజా సురేష్(26) హమీదుల్లానగర్‌లోని ఓ గార్డన్‌లో తోటమాలిగా పనిచేస్తున్నాడు. సురేష్ 12న రాత్రి భార్య శిరీషకు ఇంటికి ఫోన్‌చేసి తన వస్తున్నాని చెప్పాడు. కొద్దిసేపటికి సురేష్ స్నేహితుడు మల్లేష్ ఫోన్‌చేసి సురేష్ మద్యం తాగి ఎక్కడో పడుకున్నాడని, అతడి విషయం తనకు తెలియదని చెప్పాడు. దీంతో శిరీష, ఆమె కుటుంబీకులు సురేష్ కోసం వెతికారు. చివరకు అతడు పనిచేసే గార్డెన్‌లోనే ఉన్న బావిలో అతడి మృతదేహాన్ని గుర్తించారు. దీంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.